క్లుప్తంగా

ధనలక్ష్మి కుటుంబానికి ఎమ్మెల్యే సింహాద్రి పరామర్శ



మోపిదేవి: మండలంలోని మెరకనపల్లి శివారు చిరువోలు ఎస్సీ కాలనీకి చెందిన యన్న ధనలక్ష్మి (82) అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శుక్రవారం ఆమె ఇంటికి వెళ్లి మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి తెలిపారు. పార్టీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, ముత్యాల గోపాలరావు, బాపట్ల కిషోర్, బొంతు రవి, గౌరిపర్తి వేణు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి సొసైటీ సహాయం

మాజేరు(చల్లపల్లి): రైతు కుటుంబానికి మాజేరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. మండల పరిధిలోని పాతమాజేరుకు చెందిన రైతు తిరుమలశెట్టి తులసీభాయ్ (85) ఇటీవల మృతి చెందారు. పీఏసీఎస్ సభ్యుల సంక్షేమ నిధి నుంచి శుక్రవారం రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని తులసీభాయ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ అరజా శివశంకర్, సీఈఓ ఎస్.ఎస్. చక్రపాణి, పర్సన్లు మోతుకూరి నాగమల్లేశ్వరరావు, పల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు



పెడన: ఎన్నికల నియమావళికి విరుద్ధంగా పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన పలు ఫ్లెక్సీలను మునిసిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య శుక్రవారం తొలగించారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభ నిర్వహించడంతో పాటు ఫ్లెక్సీలను ఏర్పాటు చేసింది. వాటి ఏర్పాటుకు ఎన్నికల అధికారి నుంచి అనుమతులు లేకపోవడంతో పాటు సీ–విజిల్‌కు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో మునిసిపల్ కమిషనర్ వాటిని తొలగించేలా చర్యలు తీసుకున్నారు. టీపీఓ ఏసుబాబు, శానిటరీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దుర్గమ్మ గుడి వంటశాల నిర్మాణానికి భూమిపూజ

గణపేశ్వరం(నాగాయలంక): గ్రామంలోని ప్రసిద్ధ శ్రీదుర్గా గణపేశ్వరస్వామి వార్ల ఆలయ ప్రాంగణంలో చేపట్టి వంటశాల నిర్మాణ పనులకు ఆలయ ధర్మకర్త మండల శ్రీరామచంద్రమూర్తి(రాంబాబు) శుక్రవారం భూమిపూజ చేశారు. రాజమండ్రిలో నివసిస్తున్న నాగాయలంకకు చెందిన దాత తలశిల జనార్దనరావు (జన్నయ్య) వంట శాల నిర్మాణానికి రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఆలయ అర్చకుడు పోతుకూచి సత్యనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో భూమి పూజ జరిగింది. వర్రే భిక్షం, పిరాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రెడ్ క్రాస్ చేయూత

పెడన: మండలంలోని కొంగంచర్ల గ్రామానికి చెందిన కొనతం నాగరాజు కుటుంబం నివసించే పూరిల్లు, గడ్డివామి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. బాధిత కుటుంబానికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కృష్ణాజిల్లా శాఖ ఆధ్వర్యంలో తాత్కాలిక నివాసం కోసం టార్పాలిన్, వంట పాత్రలు, సబ్బులు, పేస్టులు, కొబ్బరి నూనె తదితర నిత్యావసరాలతో కూడిన హైజీన్ కిట్‌ను శుక్రవారం అందజేశారు. రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి భవిరి శంకర్ నాథ్, జిల్లా కోఆర్డినేటర్ సాయి అరుణ్, కొంగంచర్ల వీఆర్వో ఆదిలక్ష్మి, పంచాయతీ సెక్రటరీ రాజేంద్ర, వెల్ఫేర్ అసిస్టెంట్ లూథియా తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి వేసవి శిక్షణ

అవనిగడ్డ: స్థానిక గ్రంథాలయంలో ఈ నెల 29 నుంచి జూన్ ఏడో తేదీ వరకు వేసవి శిక్షణ తరగతులు జరుగుతాయని గ్రంథాలయ అధికారి జుజ్జువరపు ప్రభుదాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చిత్రలేఖనం, పుస్తక పఠనం, చదవడం, కథలు చెప్పడం, ఇంగ్లిష్ గ్రామర్, క్రాఫ్ట్ వర్క్, పేపర్ కటింగ్, అగర్‌బత్తీల తయారీ, గిఫ్ట్ ప్యాకింగ్, తెలుగు పద్యాలు, భగవద్గీత పఠనంపై శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఈ శిక్షణ కార్యక్రమానికి పిల్లలను పంపించి ప్రత్యేక అంశాలు నేర్చుకునేలా ప్రోత్సహించాలని కోరారు. వివరాలకు 91334 96141, 92909 98727 సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

యుద్ధ ప్రాతిపదికన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

మచిలీపట్నంటౌన్: నగరంలోని భాస్కరపురం గాంధీబొమ్మ సెంటరులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కేబుల్ గురువారం సాయంత్రం అగ్నిప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవటంతో స్పందించిన విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది హుటాహుటిన అదే రోజు నూతన డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఆ ప్రాంత విద్యుత్ వినియోగదారులకు ఇబ్బంది లేకుండా పనిపూర్తి చేసిన సిబ్బందిని ఈఈ భాస్కరరావు, ఏఈ రమణ అభినందించారు.

విజయీభవ.. ద్విగ్విజయీభవ

- ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న పేర్ని కిట్టు
- హారతులు ఇచ్చి విజయోస్తు అంటూ దీవిస్తున్న మహిళలు
- సుల్తానగరంలో కోలాహలంగా ఎన్నికల ప్రచారం



ఆంజనేయ స్వామి గుడి వద్ద పేర్ని కిట్టుకు వీరతిలకం దిద్దుతున్న మహిళలు

కోనేరుసెంటర్: బందరు మండలంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కిట్టు నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ప్రచారంలో భాగంగా గ్రామాలకు వెళ్తున్న కిట్టుకు ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారు. మహిళలు హారతులు పట్టి విజయోస్తు అంటూ ఆశీర్వదిస్తున్నారు. పెద్దలు విజయీభవ అంటూ ఆలయాల్లో పూజలు జరిపిస్తున్నారు. పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామాల్లోకి తీన్మార్ డప్పులతో ఆహ్వానం పలుకుతూ కదం తొక్కుతూ జేజేలు కొడుతున్నారు. యువకులు, పార్టీ అభిమానులు పూల వర్షం కురిపిస్తూ అభిమానం చాటుకుంటున్నారు. పిల్లలు, పెద్దలు పార్టీ జెండాలు పట్టుకుని జై జగన్.. జై జై జగన్.. వర్ధిల్లాలి పేర్ని నాని, కిట్టు నాయకత్వం అంటూ నినాదాలు చేస్తున్నారు. శుక్రవారం సుల్తానగరం గ్రామంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కిట్టుకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు జరిపించి 'బిడ్డా ఆశీర్వదిస్తున్నాం అందుకో విజయం' అంటూ వీర తిలకం దిద్దారు. గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వం ప్రతి కుటుంబానికి అందించిన సంక్షేమ ఫలాలను గుర్తు చేస్తూ వచ్చే ఎన్నికలలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని పేర్ని కిట్టు అభ్యర్థించారు. తనను పెద్ద మనసుతో ఆశీర్వదించి అఖండ మెజార్టీ చేకూర్చాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి మద్దతు తెలపండి

- ఇంటింటి ప్రచారంలో ఉప్పాల రాము
- రాయవరం గ్రామంలో ప్రజాదీవెన యాత్ర



ఇంటింటి ప్రచారం చేస్తున్న ఉప్పాల రాము



దివ్యాంగుడికి కరపత్రం అందిస్తున్న హారిక

గూడూరు: రాష్ట్రంలో ఐదేళ్లలో జరిగిన సంక్షేమం, అభివృద్ధికి ప్రజలు సంపూర్ణ మద్దతు తెలపాలని వైఎస్సార్ సీపీ పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రాము ప్రజలను కోరారు. ప్రజాదీవెన యాత్రలో భాగంగా మండలంలోని రాయవరం గ్రామంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో కలిసి శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ.. చేనేత కార్మికులు ఎక్కువగా ఉన్న రాయవరంలో మగ్గం ఉన్న ప్రతి నేతన్నకు వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా ఏడాదికి రూ.24 వేల చొప్పున ఐదేళ్లలో రూ.1.20 లక్షల సాయంచేశారని గుర్తుచేశారు. 50 ఏళ్లు నిండిన నేత కార్మికులకు వారి ఇంటి వద్దకే సామాజిక పెన్షన్ అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. మనబడి నాడు–నేడు కార్యక్రమం ద్వారా గ్రామంలోని పాఠశాలను అధునాతనంగా తీర్చిదిద్ది, ఆంగ్ల మాధ్యమంలో బోధన చేపట్టామని, ఫలితంగా ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పాఠశాల విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని వివరించారు.

సమస్యలు పరిష్కరిస్తా

ఇంటింటి ప్రచారంలో ఉప్పాల రాముకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానికులు తాగునీరు, అంతర్గత రోడ్లు వంటి సమస్యలు రాము దృష్టికి తీసుకొచ్చారు. వాటిపై స్పందించిన ఉప్పాల రాము మాట్లాడుతూ.. ఇప్పటికే గ్రామప్రజలకు సురక్షిత తాగునీరు అందించే దిశగా జెడ్పీ నిధులు మంజూరు చేయించామన్నారు. గ్రామంలో ఉన్న రక్షిత నీటి పథకానికి అనుసంధానంగా మైక్రో ఫిల్టర్లు ఏర్పాటు చేసే ప్రక్రియ జరుగుతోందని వివరించారు. ఈ పనులు పూర్తవగానే ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన సురక్షిత తాగునీరు అందుతుందని హామీ ఇచ్చారు. ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రాధాన్యతా క్రమంలో అంతర్గత రహదారుల నిర్మాణం చేపడ్తామన్నారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ ఓట్లను ఫ్యాను గుర్తుపై వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఘన విజయం చేకూర్చాలని అభ్యర్థించారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, పార్టీ అధ్యక్షుడు పర్ణం పెదబాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బూరగడ్డ శ్రీకుమార్, పీఏసీఎస్ చైర్మన్ కోళ్ల బాలకృష్ణ, సర్పంచి నందం మల్లీశ్వరి రవికిరణ్, మాజీ సర్పంచి తమ్మిశెట్టి వరలక్ష్మి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం



కోడూరులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కొత్తపల్లిలో ఓట్లు అభ్యర్థిస్తున్న సింహాద్రి వికాస్



బోళ్లపాడులో ఎన్నికల ప్రచారం చేస్తున్న సింహాద్రి కుమార్తె నిశ్చల, పార్టీ నేతలు

కొత్తపల్లి(ఘంటసాల): గడప గడపకూ సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని సింహాద్రి వికాస్ అన్నారు. ఘంటసాల మండలం కొత్తపల్లి, మల్లంపల్లి పంచాయతీ శివారు బోళ్లపాడు గ్రామాల్లో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కుమారుడు వికాస్, కుమార్తె నిశ్చల స్థానిక నేతలతో కలసి శుక్రవారం ముమ్మరంగా ఎన్నికల ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లోని అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలను కలసి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలయిన సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్ బాబుకు, బందరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావుకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఘంటసాల ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావు, జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల మురళీకృష్ణ, అవిర్నేని ప్రపూర్ణచంద్, అవిర్నేని హశ్వంత్, అంగడాల నాగరాజు, మూల్పూరి వెంకయ్య, ఎంపీటీసీ కొలుసు ఝాన్సీలక్ష్మి, పడమట వీరకుమార్, తాతినేని కృష్ణారావు, యడ్ల బాబ్జి, తుమ్మల వెంకటేశ్వరరావు, పడమట శ్రీనివాసరావు, దేవినేని విజయ్‌కుమార్, ఆకురాతి భాస్కరరావు పాల్గొన్నారు.

విస్తృతంగా వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం

కోడూరు: వైఎస్సార్ సీపీ మండల నేతలు, కార్యకర్తలు, అభిమానులు శుక్రవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. ఎమ్మెల్యేగా సింహాద్రి రమేష్‌బాబును, ఎంపీగా సింహాద్రి చంద్రశేఖరరావును గెలిపించాలని కోరారు. వడ్డెరకాలనీ, కోడూరులో ఇంటింటికీ వెళ్లి రెండు ఓట్లూ ఫ్యాన్ గుర్తుపై వేయాలని అభ్యర్థించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రంలో అభివృద్ధి జరగడంతో పాటు పేదలకు సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందుతాయని వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, పరిశె మాధవరావు, బడే గంగాధరరావు, తిమ్మన నాంచారయ్య, కోట పద్మావతి వరప్రసాద్, వెన్నా ప్రసాద్, ఇంకొల్లు మురళీకృష్ణ, కోట సుబ్రహ్మణ్యం, బండే నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పెడనలో పది నామినేషన్లకు ఆమోదం

పెడన: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పెడన నియోజకవర్గానికి 12 మంది 24 సెట్ల నామినేషన్లను దాఖలు చేయగా వాటిని శుక్రవారం పరిశీలించారు. అభ్యర్థులు, వారి ప్రతినిధులు సమక్షంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.వెంకటరమణ వీటిని పరిశీలించారు. నామినేషన్లపై ఏమైనా అభ్యంతరాలుంటే లిఖితపూర్వకంగా పూర్తి ఆధారాలతో తెలియజేయాలని ఈఆర్వో వెంకటరమణ కోరారు. అనంతరం ఒక్కో నామినేషన్ పత్రాన్ని పరిశీలించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి రమేష్ ఉప్పాల (రాము) నాలుగు సెట్లు దాఖలు చేయగా మొదటి దానిని ఆమోదించి మిగిలిన వాటిని రిజెక్ట్ చేశారు. రమేష్ డమ్మీగా హారిక ఉప్పాల దాఖలు చేసిన నామినేషన్లు మూడు సెట్లును కూడా రిజెక్ట్ చేశారు. టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ నామినేషన్లలో ఒక సెట్‌ను ఆమోదించి మిగిలిన వాటిని తిరస్కరించారు. కాగిత శిరీష నామినేషన్లను కూడా తిరస్కరించారు. కాంగ్రెస్ అభ్యర్థి శొంఠి నాగరాజు, బీఎస్పీ అభ్యర్థి ఈడే కాశీవిశ్వేశ్వరరావు, రేవతీదేవి సబ్బిశెట్టి(పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), విష్ణుమూర్తి కాట్రగడ్డ (యుగ తులసీపార్టీ), స్వతంత్ర అభ్యర్థులు సమ్మెట వెంకన్నబాబు, సేనాపతి గోపీ, కాగిత శ్రీహరి కృష్ణప్రసాద్, జమదగ్ని రాజులపాటి నామినేషన్లను ఆమోదించారు.

29 వరకు ఉపసంహరణకు గడువు

29వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉందని ఈఆర్వో వెంకటరమణ వెల్లడించారు. చివరి రోజున అభ్యర్థుల తుది జాబితా గుర్తులతో సహా వెల్లడిస్తామని తెలిపారు. 28న ఆదివారం సెలవని, 27, 29వ తేదీల్లో మాత్రమే ఉపసంహరణకు అవకాశం ఉందని స్పష్టంచేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల సమయంలో మాత్రమే ఉపసంహరణ ఉంటుందన్నారు. ఉపసంహరణ సమయంలో అభ్యర్థి తప్పనిసరిగా ఉంటే మంచిదని సూచించారు. ఏఈఆర్వో, పెడన తహసీల్దారు ఆర్.రాంబాబు, ఎన్నికల డీటీ కల్పన, బంటుమిల్లి తహసీల్దారు వై.రవికుమార్, ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

మచిలీపట్నంలో జోరుగా ప్రచారం



32వ డివిజన్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వరరావు, మౌనిక



28వ డివిజన్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తిని పలుకరిస్తున్న కార్పొరేటర్ షాహినా

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు డివిజన్లలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ పార్టీ శ్రేణులు శుక్రవారం ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించాయి. పార్టీ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)లకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి విజయం చేకూర్చాలని కోరాయి. ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జ్‌లు, గృహసారథులు అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను ఇంటింటికి అందజేశారు. నగరంలోని 32వ డివిజన్‌లో కార్పొరేటర్ చింతా వెంకటేశ్వరరావు, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ చింతా మౌనిక, 28వ డివిజన్‌లో కార్పొరేటర్ షేక్ షాహెనా, డివిజన్ ఇన్‌చార్జ్ షేక్ మొహమ్మద్‌సాహెబ్, 29వ డివిజన్‌లో కార్పొరేటర్ కట్టా కేదారేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ యర్రా శ్రీనివాసకుమార్, 11వ డివిజన్‌లో పార్టీ నగర కన్వీనర్ గూడవల్లి నాగరాజు తదితర డివిజన్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

నేడు పెడనలో ప్రజాదీవెన

పెడన: ప్రజాదీవెనలో భాగంగా వైఎస్సార్ సీపీ పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము), జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక పెడన పట్టణంలో శనివారం ప్రజాదీవెన కార్యక్రమం నిర్వహిస్తారని పార్టీ పట్టణ అధ్యక్షుడు బండారు మల్లికార్జునరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12, 13, 14వ వార్డుల్లోని గడప గడపకూ వెళ్లి ప్రచారం చేసి, ఓట్లు అభ్యర్థిస్తారని పేర్కొన్నారు. అభిమానులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఈఈ ఎం. భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకు ఈడేపల్లి శ్రీనివాసనగర్‌కాలనీ, జల్లు వారి వీధి, పోస్టల్ కాలనీ, పంచాయతీరాజ్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అవనిగడ్డలో మూడు నామినేషన్ల తిరస్కరణ

అవనిగడ్డ: అవనిగడ్డ శాసనసభ ఎన్నికలకు సంబంధించి శుక్రవారం నామినేషన్లను పరిశీలించారు. మూడు నామినేషన్లను తిరస్కరించినట్టు ఆర్వో బాల సుబ్రహ్మణ్యం తెలిపారు. మొత్తం 15 మంది నామినేషన్లు దాఖలు చేయగా, పది మంది ప్రతిపాదితుల సంతకాలు లేనందున సింహాద్రి వికాస్, మండలి వెంకట్రామ్, అందె శ్రీవాణి నామినేషన్లు తిరస్కరించినట్టు ఆర్వో వెల్లడించారు. సింహాద్రి రమేష్‌బాబు(వైఎస్సార్ సీపీ), మండలి బుద్ధప్రసాద్(జనసేన), అందె శ్రీరామమూర్తి (కాంగ్రెస్), గుంటూరు నాగేశ్వరరావు(బీఎస్పీ), సముద్రాల అంబేడ్కర్ (జైభీమ్ భారత్ పార్టీ), బోయిన బుద్ధప్రసాద్ (నవరంగ్ కాంగ్రెస్ పార్టీ), ముంగర వెంకట నాంచారయ్య (భారత పిరమిడ్ పార్టీ), వెంట్రప్రగడ ఆనంద్‌కుమార్ (జాతీయ జనసేన పార్టీ), నాదెళ్ల గిరిధర నాయుడు, తాడంకి చంటి, నీలా మనోహర బాబు, మత్తి పుష్పకుమార్ నామినేషన్లు సక్రమంగానే ఉన్నాయని వివరించారు.

జగనన్నను మరోసారి దీవించండి



ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మేళ్లమర్రు(మోపిదేవి): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి దీవించి ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్ సీపీ అవనిగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు తనయుడు సింహాద్రి వికాస్‌బాబు, కుమార్తెలు నిశ్చల, డాక్టర్ సహజ, అల్లుడు డాక్టర్ రంగనాథ్ కోరారు. మండలంలోని పెదకళ్లేపల్లి గ్రామ సచివాలయం–2లో మేళ్లమర్రు, ఆయోధ్య గ్రామాల్లో వారు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఎమ్మెల్యేగా సింహాద్రి రమేష్ బాబు, మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావును ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పేద ప్రజల బతుకులు మార్చే జగనన్నకు మనమంతా అండగా నిలవాలని కోరారు. పార్టీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు, గ్రామ పార్టీ కన్వీనర్ గందు దుర్గారావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ పండలనేని అన్నపూర్ణ, శివప్రసాద్, తూము వెంకటేశ్వరావు, మాజీ సర్పంచ్ అరజా వెంకట సుబ్బారావు, కొండేటి రమేష్, పారిటిగడ్డ సుధీర్, కళ్లేపల్లి గణేష్‌గాంధీ, తైలం బ్రహ్మరాజు, తలుపుల సుధాకర్ పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు



సంగమేశ్వరంలో పనులు చేస్తున్న కూలీలు

నాగాయలంక: మండలంలో ఉపాధి హామీ పథకం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రూ.9 కోట్లతో 1200 పనులను జూన్ నాటికి పూర్తిచేస్తామని ఏపీఓ టి.వి.ఎస్ ముత్యాలు తెలిపారు. ప్రస్తుతం మండలంలోని 22 పంచాయతీల పరిధిలో 5,300 మంది ఉపాధి కూలీలకు రూ.70 లక్షల విలువైన 169 పనులు చూపించామని పేర్కొన్నారు. ఈ పనులు చురుకుగా జరుగుతున్నాయని వివరించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ జె.కె.రామకుమార్ పర్యవేక్షణలో ఈ పనులు ఇప్పటికే 50 శాతం పూర్తయ్యాయని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు పనులను సమీక్షిస్తూ కూలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని ఏపీఓ వెల్లడించారు. పంట బోదెలు, సేద్యపు నీటి కుంటలు, పంట కాలువలు, మురుగు పారుదల కాలువలు, పశువుల నీటి చెరువుల్లో పూడికతీత పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో నీడ కోసం పందిళ్లు, తాగునీటి సౌకర్యంతో పాటు ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచామని వివరించారు.

30న ఉచిత వైద్యశిబిరం

మచిలీపట్నంటౌన్: స్థానిక ఆంధ్రా ఆస్పత్రిలో ఈ నెల 30వ తేదీన ఉచిత గుండె సంబంధ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహిస్తామని ఆస్పత్రి ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ కె.శ్రీనివాసరెడ్డి ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రోగులకు వైద్యసేవలు అందిస్తారని పేర్కొన్నారు. గుండె సంబంధిత వ్యాధులు, ఛాతీలో నొప్పి, దడ, అధిక రక్తపోటు, కాళ్ల బరువు తదితర సమస్యలతో బాధపడే రోగులు ఈ శిబిరంలో వైద్య సేవలు పొందొచ్చని సూచించారు. ఈసీజీ, జీఆర్‌బీఎస్, టూడీ ఎకో పరీక్షలను ఉచితంగా చేస్తారని తెలిపారు. అవసరమైన వారికి ఇతర రక్తపరీక్షలపై 50 శాతం రాయితీ ఇస్తామని పేర్కొన్నారు. ఈ వైద్యశిబిరాన్ని మచిలీపట్నం ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్తికేయుని సేవలో వితిక



మోపిదేవి: మండల కేంద్రమైన మోపిదేవి గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని సినిమా హీరోయిన్ వితిక శుక్రవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆమె తొలుత ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం పుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించారు. అనంతరం స్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేయించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

గిలకలదిండి మెరైన్ సీఐ పెద్దిరాజు

కోనేరుసెంటర్: వేట నిషేధం సమయంలో ఎవరైనా చేపల వేటకు పాల్పడుతూ పట్టుబడితే చర్యలు తప్పవని గిలకలదిండి మెరైన్ సీఐ బి.పెద్దిరాజు హెచ్చరించారు. ఆయన మెరైన్ పోలీస్ స్టేషన్లో బోట్ల యజమానులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. ఈ నెల 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు సముద్రంలో చేపల వేట నిషేధం ఉన్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ రెండు మాసాల్లో బోట్ల యజమానులు చేపల వేటకు స్వస్తి పలకాలన్నారు. రహస్యంగా వేటకు పాల్పడినట్లు తెలిస్తే ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం కేసు నమోదు చేయడంతో పాటు భారీగా జరిమానా విధిస్తామని హెచ్చరించారు. మెరైన్ డిక్లరేషన్ యాక్ట్ 1995 ప్రకారం చేపల వేటకు పాల్పడిన వ్యక్తులతో పాటు సంబంధిత బోటు యజమానులపై చర్యలు తప్పవని పేర్కొన్నారు. సమావేశంలో మెరైన్ ఎస్ఐ పి.సోమశేఖర్‌రెడ్డి, ఫైబర్ బోట్లు సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు నెలబాలుడు, మోటార్, మెకనైజ్డ్ మరబోట్ల యజమానులు పాల్గొన్నారు.

కనులపండువగా విగ్రహ ప్రతిష్ట



స్వామివార్లకు పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, గ్రామప్రముఖులు

కోడూరు: వేదపండితులు మంత్రోచ్ఛరణ.. మంగళ వాయిద్యాలు, మేళతాళాల నడుమ సీతారామచంద్రస్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ అత్యంత వైభవంగా జరిగింది. మండలంలోని పిట్టల్లంక శివారు భావిశెట్టివారిపాలెం గ్రామంలో నిర్మించిన ఆలయంలో శుక్రవారం ఉదయం 8.45 గంటలకు స్వామివార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. పది మంది రుత్వికులు ఈ క్రతువును నిర్వహించారు. మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిష్ఠోత్సవాన్ని తిలకించేందుకు భక్తజనం వేలాది తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. సుమారు రూ.25 లక్షలతో ఆలయ నిర్మాణం జరిగిందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. టీటీడీ రూ.10 లక్షలు ఇచ్చిందని, మరో రూ.15 లక్షలు భక్తులు విరాళంగా ఇచ్చారని పేర్కొన్నారు. ఐదు వేల మందికి కమిటీ ఆధ్వర్యంలో అన్నసంతర్పణ చేశారు.

వైఎస్సార్ సీపీ గెలుపు కోసం ప్రార్థనలు

చల్లపల్లి: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపు కోసం పార్టీ నాయకులు శుక్రవారం స్థానిక పడమరవైపు జెండా చెట్టు వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏపీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ దిల్‌షాద్ నజరానా, పార్టీ మైనారిటీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శులు పఠాన్ కరిముల్లా ఖాన్, సయ్యద్ సికిందర్ పార్టీ నాయకులతో కలిసి మచిలీపట్నం ఎంపీగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్, ఎమ్మెల్యేగా సింహాద్రి రమేష్ బాబు గెలుపు సాధించాలని ప్రార్థించారు.

ప్రతి ఓటరుకు స్లిప్పులు అందాలి

గూడూరు: పోలింగ్ కేంద్రం పరిధిలోని ప్రతి ఓటరుకూ ఓటర్ స్లిప్పులు అందించేలా చొరవ తీసుకోవాలని గూడూరు తహసీల్దారు ఎస్.ఎస్.శాంతి బూత్ లెవెల్ అధికారులను ఆదేశించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బీఎల్‌ఓలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ.. ఈ సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగేందుకు ప్రతి ఓటరుకు తమ పోలింగ్ కేంద్రం తెలిసేలా స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని ఎన్నికల కమిషన్ చేపట్టిందన్నారు. మొదటి సారి పోలింగ్ ఏజెంట్లు కూడా స్లిప్పుల పంపిణీ కార్యక్రమంలో పాలు పంచుకునేలా ఎన్నికల కమిషన్ నిబంధనలను సడలించిందని వివరించారు. డీటీ వై.శివశంకర్, ఆర్ఐ నస్రీన్ ఆరా, వీఆర్వోలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.